ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నంద్యాల జిల్లా వార్తలు 3
ఆదివారం 14 జూలై 2024



జీవ వైవిధ్యానికి నెలవైన నల్లమలలోకి ఏనుగులు రాబోతున్నాయి. కర్నాటక నుంచి శిక్షణ పొందిన 9 ఏనుగులను (కుంకీలను) రప్పించేందుకు మన అటవీ శాఖ ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఈ ప్రయత్నాలు సవ్యంగా జరిగితే త్వరలోనే కుంకీ ఏనుగులు నల్లమలకు వస్తాయి.

ఆదివారం ప్రత్యేకం Sunday special



నల్లమలలోకి గజరాజు

- అటవీ, వన్యప్రాణుల రక్షణలో కుంకీలు
- 9 శిక్షణ ఏనుగులు ఇవ్వాలని కర్నాటక అటవీశాఖను కోరిన ఏపీ ప్రభుత్వం
- కొద్దినెలల్లోనే నల్లమలకు ఏనుగుల రాక
- త్వరలోనే మైసూర్‌లో కుంకీల శిక్షణకై వెళ్లనున్న ఎన్‌ఎస్‌టీఆర్ సిబ్బంది

మంచి నిర్ణయం



నల్లమలకు కుంకీ ఏనుగులను రప్పించాలని అటవీశాఖ ఉన్నతాధికారులు అనుకోవడం చాలా మంచి నిర్ణయం. ఇప్పటికే నల్లమలలో ఎప్పుడో అంతరించిపోయిన అడవిదున్నలు తిరిగి కనిపించడం కొంత ఆనందించదగ్గ విషయమే. అయితే నల్లమలలో సంపూర్ణమైన జీవవైవిధ్యాన్ని సాధించాలన్న క్రమంలో ఏనుగులను కూడా తీసుకురావడం బాగుంటుంది. ఏనుగులు ఎప్పటికప్పుడు గడ్డి తినడం వల్ల అడవిలో అగ్నిప్రమాదాలను నివారించే అవకాశం ఉంటుంది.

- వీ.సాయిబాబా, ప్రాజెక్ట్ టైగర్, డిప్యూటీ డైరెక్టర్, ఆత్మకూరు

ఆత్మకూరు, జూలై 13: దేశంలోనే అతిపెద్ద టైగర్ రిజర్వు ఫారెస్ట్‌గా పేరుగాంచిన నాగార్జునసాగర్ - శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యం (ఎన్‌ఎస్‌టీఆర్)లో ఎన్నో రకాల జంతువులు ఉన్నప్పటికీ ఏనుగులు లేవు. నల్లమలలో విశాలమైన పచ్చిక మైదానాలు లేకపోవడం, చెరువులు, కుంటలు తదితర నీటివనరులు పుష్కలంగా లేకపోవడం దీనికి కారణమని చెబుతున్నారు. సాధారణంగా మహావృక్షాలతో కూడిన అటవీ ప్రాంతాల్లో ఏనుగుల సంచారం అధికంగా ఉంటుంది. అయితే నల్లమలలో దట్టమైన వెదురు పొదలు మాత్రమే ఉంటాయి. వీటిలో ఏనుగులు ఆవాసాన్ని ఏర్పాటు చేసుకునేందుకు ఆసక్తి చూపవు.

ఇకపై నల్లమల రక్షణకు కుంకీలు

నల్లమలలో పూర్తి జీవవైవిధ్యాన్ని తీసుకొచ్చేందుకు అన్నిరకాల జంతువులను రప్పించాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇప్పటికే నల్లమలలో అంతరించిపోయిన అడవిదున్నలను తిరిగి నల్లమలకు తీసుకొచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తుండగా తాజాగా కుంకీలను (శిక్షణ పొందిన ఏనుగులు) నల్లమలకు తీసుకురావాలని అటవీశాఖ ప్రయత్నిస్తోంది. ఏనుగులకు మిగతా అన్ని జంతువుల కన్నా ఎంతో తెలివితేటలు ఉంటాయి. వీటి తెలివితేటలను ఇప్పటికే కర్నాటక, కేరళ, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో అటవీ, వన్యప్రాణుల రక్షణకై ఉపయోగించుకుంటున్నారు. అటవీ ప్రాంతాల్లోని ఏనుగులు గ్రామాల వైపు రాకుండా వాటిని దారి మళ్లించేందుకు కుంకీలను వినియోగిస్తారు. కుంకీలు వన్యప్రాణులకు, మనుషులకు మధ్యవర్తులుగా వ్యవహరిస్తాయి. వీటిద్వారా నల్లమలలో కలప అక్రమ రవాణా, వన్యప్రాణుల వేటకు అడ్డుకట్ట వేయడంతో పాటు ఏదైనా సందర్భంలో పెద్దపులి, చిరుత వంటి వన్యప్రాణులు గాయపడినప్పుడు లేదా ఆరోగ్యం క్షీణించినప్పుడు మారుమూల ప్రదేశానికి సైతం కుంకీల ద్వారా అక్కడి పరిసరాలకు చేరుకుని పరిస్థితిని పరిశీలించేందుకు అవకాశం వుంటుంది. తద్వారా గాయపడిన వన్యప్రాణికి చికిత్సలు అందించవచ్చు. ఇప్పటికే అటవీ, వన్యప్రాణుల రక్షణలో అనేక మంది అటవీశాఖ సిబ్బందితో వివిధ బృందాలు పనిచేస్తున్నారు. ప్రత్యేకించి స్ట్రైకింగ్ ఫోర్స్, యాంటిపోచింగ్ ఫోర్స్, స్క్వాడ్ టీం, బేస్ క్యాంపుల వద్ద ప్రొటెక్షన్ వాచర్స్ తదితర విభాగాలతో నిఘా ఉంచుతున్నారు. అలాగే కెమెరా ట్రాప్స్, డ్రోన్ కెమెరాలు, ఇతర అత్యాధునిక పరికరాలను అటవీరక్షణకు ఉపయోగిస్తున్నారు. వీటితో పాటు కుంకీలను కూడా అటవీ, వన్యప్రాణుల రక్షణకు వినియోగించి ప్రతిరోజు నిర్దేశించిన అటవీ ప్రదేశంలో శిక్షకుడి పర్యవేక్షణలో ఏనుగులతో గస్తీ (పెట్రోలింగ్) చేపడితే మంచి ఫలితాలు ఉంటాయని అటవీశాఖ భావిస్తోంది.



ఏనుగులతో నల్లమలకు ప్రయోజనం

నల్లమలలో అనేకమైన గడ్డితినే జంతుజాతులు (హెరిబోర్స్) ఉన్నాయి. అయితే చాలావరకు ఏనుగులు, అడవిదున్నలతో పోల్చితే వాటి పరిమాణం చాలా తక్కువ. నల్లమలలోని వివిధ రకాల గడ్డిజాతులు, వెదురు ఆకులు, వెలగ, రాగి, మర్రి, జివ్వ చెట్లు ఉన్నందు వల్ల ఏనుగులకు ఆహార కొరత ఉండదు.

ఖర్చుతో కూడిన వ్యవహారమే

కుంకీ ఏనుగులను నల్లమల రక్షణకై తీసుకురావడం కొంత ఖర్చుతో కూడిన వ్యవహారమే. వాటి కోసం ప్రత్యేకమైన శిబిరాన్ని ఏర్పాటు చేసి పర్యవేక్షించాల్సి ఉంటుంది. అలాగే ప్రతి ఏనుగుకు సుమారు ఇద్దరు చొప్పున శిక్షకులను నియమించాలి. వీటన్నింటి కోసం అటవీశాఖ ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. అయినప్పటికీ నల్లమలకు ఏనుగులను తీసుకురావాలన్న బలమైన సంకల్పంతోనే అధికారులు ఈ ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇదిలావుంటే చిత్తూరు జిల్లాలోని కౌండిన్య అడవుల్లో జయంత్, వినాయక అనే రెండు కుంకీ ఏనుగులు ఉన్నాయి. ఆడ ఏనుగులు గుంపులుగా సంచరిస్తే మగ ఏనుగులు ఒంటరిగా తిరుగుతాయి. అందుకే కుంకీ ఏనుగులకు ఎక్కువగా మగ ఏనుగులనే ఎంచుకుంటారు.



త్వరలోనే మైసూర్‌లో కుంకీల శిక్షణకై వెళ్లనున్న ఎన్‌ఎస్‌టీఆర్ సిబ్బంది



ఆంధ్రప్రదేశ్‌లోని నల్లమల రిజర్వు ఫారెస్ట్ ప్రాంతానికి 9 శిక్షణ ఏనుగులు ఇవ్వాలని కర్నాటక రాష్ట్ర అటవీశాఖను ఏపీ ప్రభుత్వం కోరింది. ఇందుకు కర్నాటక అటవీశాఖ ఆమోదం తెలపడంతో త్వరలోనే మైసూరులో కుంకీల శిక్షణకై నల్లమల పరిధిలో పనిచేస్తున్న అటవీ సిబ్బంది వెళ్లనున్నట్లు తెలిసింది. వారు అక్కడ కుంకీల శిక్షణలో నిష్ణాతులైన తర్వాత వాటిని నల్లమలకు తీసుకొచ్చి అటవీ, వన్యప్రాణుల రక్షణకు వినియోగించనున్నట్లు సమాచారం. ఈ ప్రక్రియ అంతా సవ్యంగా జరగేందుకు మరో కొన్ని నెలల సమయం పట్టవచ్చునని తెలిసింది.

చిరుతను బంధిస్తాం

- బోన్ల ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేసిన వైల్డ్ లైఫ్ వార్డెన్
- మహానందిలో గోశాల పరిసరాలను సందర్శించిన అజయ్‌కుమార్ నాయక్

మహానంది, జూలై 13: మహానంది పరిసరాల్లోని ప్రజలను గత నెల రోజుల నుండి భయాందోళనకు గురి చేస్తున్న చిరుతపులిని బంధించేందుకు అటవీశాఖ రాష్ట్ర పీసీసీఎఫ్, వైల్డ్ లైఫ్ వార్డెన్ అజయ్‌కుమార్ నాయక్ సుముఖత వ్యక్తం చేశారు. శనివారం ఆయన ఆలయ పరిసరాల్లోని గోశాల వద్ద చిరుతపులి సంచరించిన ప్రదేశాలను ఆలయ అధికారులతో కలసి పరిశీలించారు. అనంతరం అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్ అనురాగ్‌మీనా, ఆలయ ఏఈఓ వెంకటేశ్వర్లు, ఇంజనీరింగ్ అధికారి శ్రీనివాసులు యాదవ్‌తో ఆయన చిరుతపులి కదలికలపై చర్చించారు. చిరుతపులి సంచారం వల్ల ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకొన్నారు. దీనివల్ల ప్రజల నుండి తీవ్ర వ్యతిరేకత వస్తున్నదని అధికారులు ఆయన దృష్టికి తెచ్చారు. దీనికి అజయ్‌కుమార్ నాయక్ స్పందిస్తూ.. మరి కొద్ది రోజులు మహానంది పరిసరాల్లోని ప్రజలు జాగ్రత్తగా ఉండేలా చూడాలని, చిరుతపులిని బంధించేందుకు బోన్లు ఏర్పాటు చేయడానికి తాను సముఖంగా ఉన్నానని అన్నారు. ఈ మేరకు ఆదేశాలు వచ్చే వరకు ఓపిక పట్టండి అన్నారు. చిరుతను బంధించి దట్టమైన నల్లమలలో వందల కిలో మీటర్ల దూరంలోగాని, లేక జూలోగాని వదిలిపెట్టేందుకు ఏర్పాట్లు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ హైమవతి, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు ప్రతాప్, శ్రీనివాసులు పాల్గొన్నారు.



మహానందిలో దేవస్థానం గోశాల పరిసరాలను సందర్శిస్తున్న అటవీశాఖ రాష్ట్ర పీసీసీఎఫ్, వైల్డ్ లైఫ్ వార్డెన్ అజయ్‌కుమార్ నాయక్

నంద్యాల జిల్లా ఎస్పీగా అధిరాజ్‌సింగ్ రాణా

రిటైర్మెంట్‌కు ముందు రఘువీర్ రెడ్డి బదిలీ



అధిరాజ్‌సింగ్ రాణా

నంద్యాల క్రైం, జూలై 13: నంద్యాల జిల్లా ఎస్పీగా అధిరాజ్‌సింగ్ రాణాను నియమిస్తూ డీజీపీ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్‌గా విధులు నిర్వహిస్తున్న అధిరాజ్‌సింగ్ రాణాను నంద్యాలకు బదిలీ చేశారు. నంద్యాల నూతన జిల్లాగా ఆవిర్భవించినప్పటినుంచి ఎస్పీగా విధులు నిర్వహిస్తున్న కె.రఘువీర్‌రెడ్డిని డీజీపీ హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేసుకోవాలని ఉన్నతాధికారులు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఇంతవరకు నంద్యాల ఎస్పీగా పనిచేసిన కె.రఘువీర్‌రెడ్డి మరో నాలుగు నెలల్లో రిటైర్మెంట్ కానున్నారు. రిటైర్మెంట్‌కు దగ్గరగా ఉన్న వారిని దాదాపు బదిలీ చేయరు. కానీ ఎస్పీ రఘువీర్‌రెడ్డి గతంలో ప్రస్తుత ముఖ్యమంత్రి, అప్పటి ప్రతిపక్ష నేత అయిన నారా చంద్రబాబునాయుడును నంద్యాలలో అరెస్ట్ చేసిన సమయంలో కీలకంగా వ్యవహరించారు. ఈ నేపథ్యంలోనే రఘువీర్‌రెడ్డిపై బదిలీ వేటు పడినట్లు తెలిసింది. ఈయనకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకుండా డీజీపీ హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేసుకోవాలని ఆదేశించారు. చంద్రబాబునాయుడు అరెస్ట్ ఉదంతంలో కీలకంగా వ్యవహరించారని టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రఘువీర్‌రెడ్డిపై బదిలీ వేటు పడుతుందని అందరూ భావించారు. రఘువీర్ రెడ్డి రిటైర్మెంట్ వరకూ ఇక్కడే ఉండాలని తీవ్రంగా ప్రయత్నాలు చేసినప్పటికీ ఆయన బదిలీ అనివార్యం కావడం విశేషం.



కె.రఘువీర్‌రెడ్డి

కర్నూలు ఎస్పీగా గరికపాటి బిందు మాధవ్



గరికపాటి బిందుమాధవ్

కర్నూలు, జూలై 13: కర్నూలు జిల్లా ఎస్పీగా గరికపాటి బిందుమాధవ్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఐపీఎస్ బదిలీల్లో భాగంగా కర్నూలు ఎస్పీగా ఈయనను నియమించింది. ప్రస్తుతం కర్నూలు ఎస్పీగా ఉన్న జి.కృష్ణకాంత్‌ను నెల్లూరు ఎస్పీగా బదిలీ చేసింది. కృష్ణకాంత్ గత ఏడాది ఏప్రిల్ నెలలో కర్నూలు ఎస్పీగా నియమితులయ్యారు. ఆ తర్వాత అవినాశ్ రెడ్డి అరెస్టులో సీబీఐకి సపోర్టు చేయకుండా కొంత మెతక వైఖరి అవలంభించారు. ఆయనను అరెస్టు చేస్తే లా అండ్ ఆర్డర్ సమస్యలు వస్తాయనీ వెనక్కు తగ్గారు. ఆ తర్వాత జిల్లాలో జరిగిన సార్వత్రిక ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా పలు దొంగతనాలు అరికట్టడంలో పలు సందర్భాల్లో ఆయన తన మార్క్‌ను చూపించుకోలేకపోయారు. ఎన్నికల అనంతరం పత్తికొండ నియోజకవర్గంలో జరిగిన వైసీపీ దాడులను అరికట్టడంలో విఫలమయ్యారు.



కృష్ణకాంత్

తుంగభద్ర డ్యాంకు 30.69 టీఎంసీలు

- 18,060 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- ఎల్లెల్సీ సాగునీరు ఇవ్వాలని రైతుల డిమాండ్



కర్నూలు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయానికి గత ఏడాదితో పోలిస్తే ఆశాజనకంగా వరద చేరుతోంది. శనివారం వరద చేరిక లెక్కలు తీసే సమయానికి డ్యాంలో 30.69 టీఎంసీలు వరద చేరినట్లు టీబీపీ బోర్డు ఇంజనీర్లు తెలిపారు. గత ఏడాది ఇదే సమయానికి 1585.22 అడుగుల వద్ద 7.47 టీఎంసీలు నిల్వ ఉండేది. 7,069 క్యూసెక్కులు వరద డ్యాంలో చేరేది. ప్రస్తుతం గరిష్ఠ నీటి మట్టం 1633 అడుగులు, నీటి నిల్వ సామర్థ్యం 105.788 టీఎంసీలుగా కాగా.. శనివారం 1606.21 అడుగుల వద్ద 30.69 టీఎంసీలు వరద చేరింది. ఎగువన కురుస్తున్న వర్షాలకు 18,060 క్యూసెక్కుల వరద జలాశయంలో చేరుతోంది. ఐదారు రోజులతో పోలిస్తే వరద స్వల్పంగా తగ్గుముఖం పట్టింది. డ్యాంలో 25 టీఎంసీలు వరద చేరి ఇన్‌ఫ్లో ఆశాజనంగా ఉంటే జూలై 15 నుంచి ఎల్లెల్సీ సహా వివిధ కాలువలకు సాగునీరు విడుదల చేస్తామని గత నెలలో జరిగిన టీబీపీ బోర్డు వాటర్ రివ్యూ కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. అయితే ప్రస్తుతం 30.69 టీఎంసీలు చేరడంతో ఐఏబీ సమావేశంతో నిమిత్తం లేకుండా సాగునీరు ఇవ్వాలని ఎల్లెల్సీ ఆయకట్టు రైతులు డిమాండ్ చేస్తున్నారు.

మల్లన్న సన్నిధిలో ఏపీ, మధ్యప్రదేశ్ హైకోర్టు జడ్జిలు



ఆలయ ప్రాంగణంలో మధ్యప్రదేశ్ జస్టిస్ దుప్పాల వెంకట రమణ

శ్రీశైలం, జూలై 13: శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను శనివారం ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్ హైకోర్టు జడ్జిలు జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప, జస్టిస్ దుప్పాల వెంకటరమణలు వేర్వేరు సమయాల్లో దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం ఆలయ రాజగోపురం వద్ద చేరుకున్న వారికి ఆలయ కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు, అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం వెంకట జ్యోతిర్మయి ప్రతాప, దుప్పాల వెంకటరమణలు స్వామివారికి అభిషేకం నిర్వహించుకుని భ్రమరాంబికాదేవి అమ్మవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం పలికి తీర్థప్రసాదాలను అందజేశారు. వీరి వెంట ఆలయ అధికారులతో పాటు పీఆర్వో టి.శ్రీనివాస రావు తదితరులు ఉన్నారు.



ఏపీ హైకోర్టు జడ్జి వెంకటజ్యోతిర్మయి ప్రతాపకు స్వాగతం పలుకుతున్న అర్చకులు, అధికారులు.

ఎటూ తేలని వాసంతి కేసు

- ఉదయం నుంచి పర్యవేక్షిస్తున్న డీఐజీ విజయరావు
- నియోజకవర్గంలోని పోలీస్‌స్టేషన్‌లో విచారణ?
- డీలాపడిపోయిన బాలిక తల్లిదండ్రులు



ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం అప్రోచ్ కాలువ వద్ద ఎదురు చూస్తున్న గ్రామస్థులు

నందికొట్కూరు, జూలై 13: వాసంతి మిస్సింగ్ కేసు ఎటూ తేలడం లేదు. ఈ కేసులో నిందితులైన ముగ్గురు మైనర్లు చెప్పిన చోటల్లా పోలీసులు శుక్రవారం వరకు గాలింపు చర్యలు చేపట్టారు. ఏపీ.ఎస్.డి.ఆర్.ఎఫ్, ఎన్.డి.ఆర్.ఎఫ్ బృందాలు మిస్సింగ్ అయిన బాలిక కోసం ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం అప్రోచ్ కాలువలో సీసీ కెమెరాలతో తనిఖీలు నిర్వహించారు. కానీ ఆచూకీ లభించలేదు. శుక్రవారం తిరిగి కొత్తముచ్చుమర్రి గ్రామంలోని శ్మశానవాటికలోను, కేసీ కాలువకు ఆవలి వైపున ఉన్న పోరంబోకులో పాతిపెట్టామని చెప్పడంతో డీఐజీ ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. కానీ ఎక్కడా ఆనవాళ్లు కనిపించలేదు. దీంతో చిన్నారుల తల్లిదండ్రులపై అనుమానం రావడంతో గత రెండు రోజుల క్రితం పిల్లల తల్లిదండ్రులను, కుటుంబ సభ్యులను అదుపులోకి తీసుకొని విచారణ మొదలు పెట్టారు. వారు కూడా పిల్లలు చెప్పినట్లుగానే విచారణలో సమాధానం చెబుతున్నట్లు తెలుస్తోంది. శనివారం నియోజకవర్గంలోని ఓ పోలీసుస్టేషన్‌లో వారిని విచారించినట్లు తెలుస్తోంది. దీంతో ఓ బాలుడి తండ్రి చిన్నారిని చంపి ముచ్చుమర్రి సమీపంలో కృష్ణానదిలో పడేశానని చెప్పడంతో పోలీసుల బృందం కొత్తపల్లి మండలం సంగమేశ్వరం వద్దకు తీసుకెళ్లి అక్కడ సంగమేశ్వరం, సిద్దేశ్వరం, అర్లపాడు తదితర పరిసర ప్రాంతాల్లో నదిలో తనిఖీ చేసినట్లు తెలుస్తోంది. మృతదేహాన్ని ఇక్కడే పడేశామని బాలురు చెప్పడంతో ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు నీటిలోకి దిగి పరిశీలించినా కూడా వాసంతి ఆచూకీ కనిపించలేదు. అయితే డీఐజీ విజయరావు కూడా కృష్ణానదిలోకి వెళ్లి మరోసారి నదిలో పరిశీలించినట్లు తెలుస్తోంది. నిందితులైన పిల్లల నుంచి వచ్చిన సమాధానమే వారి తల్లిదండ్రుల నుంచి కూడా వస్తున్నట్లు తెలుస్తోంది.

ఎంతో ఆశగా...: శనివారం వాసంతి ఆచూకీ లభిస్తుందని పోలీసులు చెప్పిన మాట మీద కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు ఎంతో ఆశ పెట్టుకున్నారు. పోలీసులు కృష్ణానదిలో మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు జల్లెడ పట్టారు. అయినా ఫలితం లేకపోవడంతో వాసంతి కుటుంబ సభ్యులు డీలాపడిపోయారు. వాసంతి మృతదేహం కృష్ణానదిలో లభించిందన్న సమాచారం గ్రామంలో పాకి పాతముచ్చుమర్రి బస్టాండులో, ముచ్చుమర్రి ఎత్తిపోతల అప్రోచ్ కాలువ మీదికి పెద్ద ఎత్తున జనం చేరుకున్నారు. కానీ మృతదేహం రాకపోవడంతో చీకటిపడ్డాక నిరాశతో తిరుగుముఖం పట్టారు.

పార్కులో డీఎస్పీ విచారణ: ముచ్చుమర్రిలోని పార్కులో ఆడుకుంటూ బాలిక అదృశ్యమైన ఘటనపై పార్కు వాచ్‌మెన్ కుమారుడిని ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు విచారించారు.

ముచ్చుమర్రి శ్మశానం, కేసీ కాలువ వెంట గాలింపు

పగిడ్యాల, జూలై 13: ముచ్చుమర్రి గ్రామానికి చెందిన వాసంతి అనే బాలిక అదృశ్యం విషయంలో శనివారం పోలీసులు మైనరు బాలురను గ్రామానికి తీసుకొని వచ్చి విచారించారు. ఈ మేరకు గ్రామంలోని కేసీ కాలువ వెంట, శ్మశానంలో, ఎత్తిపోతల వద్ద సీఐలు, ఎస్ఐలు బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం పోలీసులు కృష్ణానదిలో గాలింపు చర్యలు చేపట్టారు.



వాసంతి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విరూపాక్షి

పరామర్శించిన ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి

వాసంతి కుటుంబ సభ్యులను శనివారం ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి పరామర్శించారు. బాలిక కుటుంబానికి రూ. 10లక్షల ఆర్థిక సాయం అందజేయడంతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.



ముచ్చుమర్రిలో వాసంతి మృతదేహం కోసం ఎదురు చూస్తున్న గ్రామస్థులు



ముచ్చుమర్రి పార్కులో వివరాలను సేకరిస్తున్న ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు

భార్యను కాపాడబోయి.. భర్త మృతి

- రైలు నుంచి కిందపడిన వైనం
- భార్యకు తీవ్రగాయాలు

డోన్(రూరల్), జూలై 13: భార్యను కాపాడబోయి ప్రమాదవశాత్తు భర్త మృతి చెందిన సంఘటన శనివారం డోన్ పట్టణంలో చోటు చేసుకుంది. డోన్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఉడిపి జిల్లా కుందాపురం ప్రాంతానికి చెందిన భార్యాభర్తలు గంగోలి అఫ్రాభాను, సయ్యాద్ ఆసీఫ్ గుంటూరు నుంచి బెంగుళూరు వెళ్తున్నారు. విశాఖపట్నం నుంచి బెంగుళూరు వెళ్తున్న ప్రశాంత్ ఎక్స్‌ప్రెస్ రైల్లో భార్యాభర్తలు ప్రయాణిస్తున్నారు. డోన్ మండలం మల్కాపురం డోన్ రైల్వేస్టేషన్ మధ్యలో రైలు వెళ్తుండగా.. భార్య అఫ్రాభాను డోర్ వద్ద నిలిచి ప్రమాదవశాత్తు కాలుజారి కిందకు పడిపోయింది. ఇది గమనించిన భర్త సయ్యాద్ ఆసీఫ్ (32) హడావుడిగా భార్యను రక్షించబోతు రైలు కింద పడిపోయాడు. తోటి ప్రయాణికులు చైన్ లాగారు. రైల్వేట్రాక్‌పై పడిపోయిన సయ్యాద్ ఆసీఫ్ అప్పటికే మృతి చెందాడు. భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రయాణికులు డోన్ రైల్వేపోలీసులకు సమాచారం అందించారు. బాధితురాలిని కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రశాంత్ ఎక్స్‌ప్రెస్ రైలులో తెల్లవారుజామున జరిగిన ఈ సంఘటన కలకలం రేపింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డోన్ రైల్వే పోలీసులు తెలిపారు.

జీడీపీలో కేంద్ర జలశక్తి బృందం సర్వే

పూడికతీతపై నివేదిక తయారు చేయనున్న సర్వే బృందం

గోనెగండ్ల, జూలై 13: కర్నూలు జిల్లాలో ఏకైక మధ్య తరహా నీటిపారుదల ప్రాజెక్టు గాజులదిన్నె ప్రాజెక్టు(సంజీవయ్యసాగర్)లో ఎంత పూడిక చేరిందీ, నీటి సామర్థ్యం ఎంత అని గత మూడు రోజుల నుంచి కేంద్ర జలశక్తి బృందం సభ్యులు ప్రాజెక్టు నీటిలో బోటులో తిరుగుతూ సర్వేలు చేస్తున్నారు. ప్రాజెక్టు నిర్మించినప్పుడు నీటి నిలువ సామర్థ్యం ఎంత, ప్రస్తుతం నీటి నిలువ సామర్థ్యం ఎంత, 44 ఏళ్లుగా ప్రాజెక్టులో ఎంత మేర పూడిక చేరిందనే విషయాలపై బృందం సర్వే చేస్తున్నది. నీటిలో బోటు మీద తిరుగుతూ ప్రత్యేక మీటర్లతో సర్వేలు చేయడమే గాక నీరు లేని చోట డీ.జీ.పీ.ఎస్ అనే పద్ధతిలో ఇక్కడ వరకు నీటిని ఎంత మేర నిలువ చేయవచ్చు అనే విషయంలో కూడా సర్వే చేస్తున్నారు. దీనిపై సర్వే కేంద్రబృందం నివేదిక తయారు చేసి కేంద్ర జలశక్తి అధికారులకు సమర్పించనున్నారు. మరో నాలుగైదు రోజుల పాటు ఈ సర్వేలు జరుగుతాయని వారు తెలిపారు.

గుర్తు తెలియని వృద్ధుని మృతదేహం లభ్యం

ఎమ్మిగనూరు(రూరల్), జూలై 13: ఎమ్మిగనూరు మండల పరిధిలోని ఎర్రకోట సెయింట్ జోన్స్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో గుర్తు తెలియని 75 ఏళ్ల కలిగిన వృద్ధుడు మృతి చెందాడు. ఆగ్రాకు చెందిన ఓ వృద్ధుడు భిక్షాటన చేస్తూ కాలేజీ సమీపంలోనే ఉంటుండేవాడని స్థానికులు తెలిపారు. అనారోగ్యం కారణంగా శనివారం ఆ వృద్ధుడు మృతి చెందాడన్నారు. వృద్ధుడి తరుపు బంధువులెవరూ తెలియకపోవడంతో రూరల్ పోలీసులు ఎర్రకోటలో అంత్యక్రియలు నిర్వహించారు.

పారిశుధ్యానికే తొలి ప్రాధాన్యం : డీపీఓ

కర్నూలు(కలెక్టరేట్), జూలై 13: గ్రామాల్లో పారిశుద్యానికి, పరిశుభ్రతకే తొలి ప్రాధాన్య ఇస్తున్నట్లు డీపీవో నాగరాజు నాయుడు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా అధికారులకు శనివారం ఆయన దిశానిర్దేశం చేశారు. ప్రతి మంగళ, గురు, శనివారాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను పంచాయితీ కార్యదర్శులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమాలను మండల విస్తరణ అధికారులు, డివిజనల్ పంచాయితీ అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే, డ్రైడే కార్యక్రమాన్ని ఏఎన్ఎంలతో సమన్వయం చేసుకుని నిర్వహించాలని సూచించారు. ప్రతి నెల 2వ తేదీ నుంచి 5వ తేదీలోపు, 17 నుంచి 20వ తేదీ లోపు గ్రామాల్లోని నీటి ట్యాంకులను తప్పనిసరిగా శుభ్రం చేయించాలని ఆదేశించారు.

రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(కలెక్టరేట్), జూలై 13: కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్) కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించడం జరుగుతుందని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆగని వైసీపీ నాయకుల
ఇసుక దందా

- పోలీసుల సహకారంతో యథేచ్ఛగా కొనసాగుతున్న అక్రమాలు
- పది రోజుల కింద 1700 టన్నులు స్వాహా
- కేసు నమోదు చేసి గాలికొదిలేసిన పోలీసులు



కోసిగిలోని సాయిబాబా గుడి సమీపంలో నిల్వ ఉన్న వైసీపీ నాయకుడి ఇసుక డంప్



కోసిగిలో ఓ ఇంటి నిర్మాణం ముందు జగనన్న కాలనీకి చెందిన ఇసుక

కోసిగి, జూలై 13: అధికారం మారినా కూడా వైసీపీ నాయకుల అక్రమాలు మాత్రం ఆగడం లేదు. ఐదేళ్ల పాటు అధికారాన్ని అడ్డంగా పెట్టుకుని అక్రమాలకు పాల్పడిన వైసీపీ నేతలు.. గత ప్రభుత్వంలో పని చేసిన పోలీసుల సహకారంతో ఇంకా రెచ్చిపోతూనే ఉన్నారు. కోసిగిలోని ఉరుకుంద రోడ్డులో సాయిబాబా ఆలయం సమీపంలో ఓ వైసీపీ నాయకుడు సుమారు వంద ట్రాక్టర్ల ఇసుక డంప్‌ను నిల్వగా చేసుకున్నా పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని టీడీపీ నాయకులు, ప్రజలు ఆరోపిస్తున్నారు. ఒక ట్రాక్టరు ఇసుక కావాలంటే రూ.3వేలు వైసీపీ నాయకులు ఇసుకను అమ్ముకుంటూ జేబులు నింపుకుంటున్నారు. సీఎం చంద్రబాబు ఉచిత ఇసుక పాలసీ విధానం ప్రవేశపెట్టి ప్రజలకు, భవన నిర్మాణ కార్మికులకు చేదోడుగా నిలిచిన కూడా వైసీపీ నాయకులు ఏర్పాటు చేసుకున్న అక్రమ ఇసుక డంప్‌ల నుంచి ఒక ట్రాక్టర్ ఇసుకను రూ.3వేలుకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా స్థానిక పోలీసులకు తెలిసినా కూడా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. సజ్జలగుడ్డం రోడ్డులోని జగనన్న కాలనీకి సంబందించి 1700 టన్నులు గల సుమారు 180 ట్రాక్టర్ల ఇసుక డంప్‌ను స్థానిక వైసీపీ నాయకులు సొంత ట్రాక్టర్ల ద్వారా తమకు అనుకూలమైన చోట ఓ ఇద్దరు కానిస్టేబుళ్ల సహకారంతో నిల్వ చేసుకున్నారని అందరికీ తెలిసిపోయింది. స్వయాన హౌసింగ్ డీఈ శేఖర్ కూడా ఆ ఇద్దరు కానిస్టేబుళ్లపై కూడా ఎస్ఐ సతీష్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. అయినా ఎస్ఐ కేసు నమోదు చేసినా ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వెనుక ఆయన పాత్ర ఉన్నదనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కలెక్టర్, ఎస్పీలు వైసీపీ నాయకుల అక్రమ ఇసుక డంప్‌పై చర్యలు తీసుకొని, కేసులు నమోదు చేసి జరిమానా విధించాలని ప్రజలు కోరుతున్నారు.

పత్తికొండ ప్రజల రుణం తీర్చుకుంటాం

- మాజీ డిప్యూటీ సీఎం కేఈ క్రిష్ణమూర్తి



మాట్లాడుతున్న కేఈ క్రిష్ణమూర్తి

పత్తికొండ,జూలై 13: అభివృద్ధి ద్వారానే పత్తికొండ ప్రజల రుణం తీర్చుకుంటామని మాజీ డిప్యూటీ సీఎం కేఈ క్రిష్ణమూర్తి అన్నారు. పత్తికొండలో ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ కేఈ శ్యాంబాబును గెలిపించిన పత్తికొండ ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలుపుకుంటామని, నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కేఈ శ్యాంబాబు ముందుకుసాగుతారని అన్నారు. పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి ఒక్కరికీ అండగా ఉంటామని, ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని అన్నారు. చంద్రబాబు, లోకేష్‌ల నాయకత్వంపై తనకు పూర్తి నమ్మకం ఉందన్నారు. వెల్దుర్తి మండలానికి చెందిన టీడీపీ నాయకుడు సుబ్బరాయుడుకు ప్రాణహాని ఉన్నందు వల్ల ప్రభుత్వం ఆయనకు గన్‌మెన్‌ను కేటాయించడం హర్షణీయమన్నారు. ఆయనతోపాటు టీడీపీ నాయకులు సాంబశివారెడ్డి, మనోహర్ చౌదరి, బత్తిన లోక్‌నాథ్, కడవల సుధాకర్, వాకిటి శ్రీనివాసులు, నాగేష్ తదితరులు ఉన్నారు.

పోతుదొడ్డిలో వైసీపీ, టీడీపీ వర్గాల మధ్య ఘర్షణ

ఏడుగురికి గాయాలు



చికిత్స పొందుతున్న టీడీపీ నాయకుడు నారాయణ

ప్యాపిలి, జూలై 13: మండలంలోని పోతుదొడ్డి గ్రామంలో శనివారం వైసీపీ, టీడీపీ వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘటనలో ఇరువర్గాలకు చెందిన ఏడుగురికి గాయాలయ్యాయి. బాధితులను డోన్, కర్నూలు ఆస్పత్రులకు తరలించారు. పోతుదొడ్డి సమీపంలోని పొలాల్లో మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి సమీప బంధువులు కంకర క్రషర్ పరిశ్రమను నిర్వహిస్తున్నారు. ఈ పరిశ్రమ నుంచి వెలువడే కాలుష్యం వలన పంటలు దెబ్బతింటున్నాయని రైతుల ఆరోపణలు ఉన్నాయి. దీంతో టీడీపీకి చెందిన మాజీ సర్పంచు నారాయణ రైతులతో కలసి పది రోజుల క్రితం క్రషర్ మిషన్ దగ్గరకు వెళ్లి పరిశ్రమ వలన పంటలు దెబ్బతింటున్నాయంటూ పనులను నిలిపి చేశారు. అయితే రెండు రోజులుగా రాత్రిపూట మిషన్ ఆడిస్తూ నిర్వాహకులు వ్యాపారాన్ని సాగిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న నారాయణ శుక్రవారం మరోసారి క్రషర్ మిషన్ దగ్గరకు పనులను బంద్ చేయించారు. దీంతో వైసీపీ నాయకులు క్రిష్ణమూర్తి శనివారం తన అనుచరులతో కలసి నారాయణ ఇంటి దగ్గరకు బయలు దేరారు. అయితే మార్గమధ్యలో కట్టపై కూర్చున్న నారాయణను వైసీపీ వర్గీయులు కంకర క్రషర్‌ను ఎలా బంద్ చేయిస్తావంటూ దుర్భాషలాడుతూ ఆయనపై దాడి చేశారు. ఈ విషయం తెలుసుకున్న నారాయణ వర్గీయులు ఘటనా స్థలానికి చేరుకోవడంతో ఇరువర్గాల వారు రాళ్లు, పట్టుడు కట్టెలతో పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ ఘటనలో వైసీపీకి చెందిన క్రిష్ణమూర్తి, రంగడు, శేషు, ఆదినారాయణలకు టీడీపీకి చెందిన నారాయణ, శ్రీనివాసులు, నడిపి ఓబులేసులకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను చికిత్స నిమిత్తం డోన్, కర్నూలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ సంఘటనలో వైసీపీ, టీడీపీ వార్గాలవారు ప్యాపిలి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ సుధాకర్ రెడ్డి పోతుదొడ్డిలో పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేసినట్లు సీఐ తెలిపారు.

మంత్రాలయంలో పోటెత్తిన భక్తులు

మంత్రాలయం, జూలై 13: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం భక్తులు పోటెత్తారు. రెండవ శని, ఆదివారం సెలవు దినం కావటంతో వేలాది మంది భక్తులు తరలి వచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖ ద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, నదీతీరం భక్తులతో కోలాహలంగా మారింది. గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. క్యూలైన్స్లు, పరిమళప్రసాదం వద్ద భక్తుల సందడిగా మారింది. భక్తులు రథోత్సవాల ఊరేగింపులో పాల్గొని పండితుల ఆశీస్సులు పొందారు. భక్తుల రద్దీ పెరగడంతో లాడ్జిలు, హోటళ్లు, పూజా సామగ్రికి డిమాండ్ పెరిగింది.



మంత్రాలయం మఠం ప్రాంగణంలో రద్దీగా ఉన్న భక్తులు

సమస్యలపై ప్రశ్నిస్తారా..?

- పారిశుధ్యం మెరుగుపడేనా?
- రేపు నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం
- హాజరుకానున్న మంత్రి టీజీ భరత్, ఎంపీ ఎమ్మెల్యేలు

కర్నూలు(న్యూసిటీ), జూలై 13: నగర పాలక సంస్థ సర్వసభ్యసమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు జరగనుంది. ఈ సమావేశంలో ప్రజా సమస్యలు చర్చనీయాంశాలవుతాయా? నగరంలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలపై నిర్దిష్ట చర్చ జరిగి నిర్మాణాత్మక ప్రయత్నాలు జరుగుతాయా? అనే సందేహాలు వినిపిస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కనీసంగా కూడా పనులు జరగలేదు. వీటిపై అధికార, ప్రతిపక్ష కార్పొరేటర్లు ప్రశ్నిస్తారా లేదా అనేది చర్చనీయాంశంగా మారింది. నగర పాలక సంస్థ సర్వసభ్యసమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు సుంకేసుల రోడ్డులోని ఎస్‌బీఐ ఎంప్లాయిస్ కాలనీ కౌన్సిల్ హాలులో జరగనుంది. మేయర్ బీవై. రామయ్య అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ. భరత్‌తో పాటు కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు. పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, బొగ్గుల దస్తగిరి, కమిషనర్ భార్గవతేజ హాజరుకానున్నారు. ఎన్నికల ముందు ఫిబ్రవరి 17న చివరి సర్వసభ్యసమావేశం నిర్వహించారు. ఎన్నికల కోడ్ కారణంగా మళ్లీ జరగలేదు. సమావేశంలో 11 అజెండాలపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. ఇదిలా నగరంలో దీర్ఘకాలంగా నెలకొన్న సమస్యలపై సభ్యుల వాదనలు ఎలా ఉంటాయన్నది సర్వత్రా ఆసక్తి నెలకొంది. తుంగభద్ర పుష్కరాల సమయంలో కొన్న రూ.4 కోట్లకు పైగా విలువైన హెచ్‌డీ పైపుల మాయం వ్యవహారంపై సమగ్ర విచారణకు కమిషనర్ ఏ. భార్గవతేజ అడిషనల్ కమిషనర్ పివి. రామలింగేశ్వర్ కన్వీనర్‌గా ఏడుగురు సభ్యులతో విచారణ కమిటీ నియమించారు. ఈ సమావేశంలోనైనా పుష్కరాల కథ ముగుస్తుందా లేదా అనే విషయంపై కార్పొరేటర్లు, అధికారులు చర్చించుకుంటున్నారు. ప్రధానంగా ఉన్న పారిశుధ్య సమస్యపై గతంలో ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కొత్త ప్రభుత్వం ఏర్పాటైన నేపథ్యంలో నగరంలో పారిశుధ్యం మెరుగునకు తీసుకోవాల్సిన చర్యలపై సభ్యులు పలు తీర్మానాలు చేయాల్సిన అవసరం ఉందని నగరవాసులు పేర్కొంటున్నారు.



రోడ్డు ప్రమాదంలో
వృద్ధురాలి దుర్మరణం

కర్నూలు, జూలై 13: నగరంలో బళ్లారి చౌరస్తా సమీపంలో అంబికా మెటల్ స్టోర్స్ దుకాణం ఎదురుగా శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సోమేశ్వరమ్మ (62) అనే వృద్ధురాలు దుర్మరణం చెందింది. ఈ ప్రమాదంలో ఆమె కూతురు ప్రశాంతి తీవ్రంగా గాయపడింది. ఎన్టీఆర్ బిల్డింగ్స్‌కు చెందిన వీరిద్దరు బళ్లారి చౌరస్తా సమీపంలో ఓ బంకును నిర్వహిస్తున్నారు. రాత్రి 11 గంటలు దాటిన తర్వాత బంక్ మూసేసి ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా.. పెద్దపాడు నుంచి వస్తున్న గుర్తు తెలియని వాహనం వేగంగా వచ్చి వీరిని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో సోమేశ్వరమ్మ అక్కడికక్కడే మృతి చెందగా.. ప్రశాంతికి తీవ్రగాయాలయ్యాయి. ప్రశాంతిని చికిత్స నిమ్మితం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన వాహనం కోసం పోలీసులు గాలిస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుర్చీ వదలని మోనార్క్

- వ్యవసాయ శాఖలో రెండు దశాబ్దాలకు పైగా విధులు
- రాజకీయ పలుకుబడితో నో ట్రాన్స్‌ఫర్
- రెస్టారెంట్లను నడుపుతూ విధులకు గైర్హాజరు
- కింది స్థాయి నుంచి పైస్థాయి వరకు ఆయన గుప్పిట్లోనే
- సాధారణ ఎన్నికల్లో వైసీపీ తరుపున ఇంటింటి ప్రచారం
- రాజకీయ పలుకుబడి కారణంగా నోరెత్తని ఉన్నతాధికారులు

నంద్యాల టౌన్, జూలై 13: వ్యవసాయ శాఖలో పని చేసే ఓ ఉద్యోగి ఏళ్ల తరబడి సీటు వదలకుండా తిష్ట వేయడం ఉద్యోగ వర్గాల్లో దుమారం రేపుతోంది. దాదాపు రెండు దశాబ్దాల నుంచి జిల్లాగా నంద్యాల ఆవిర్భావానికి ముందు నుంచి.. జిల్లాగా ఏర్పడ్డాక కూడా రాజకీయ పలుకుబడితో బదిలీని నిలిపి వేయించుకుంటూ చక్రం తిప్పుతున్న నంద్యాల వ్యవసాయ శాఖలో "మోనార్క్"లా వ్యవహరిస్తూ కింది స్థాయి ఉద్యోగి నుంచి జిల్లా స్థాయి అధికార యంత్రాంగమంతా తన గుప్పిట్లో ఉందంటూ తనను ఎవరూ బదిలీ చేయించలేరని దబాయిస్తున్న వైనంపై వ్యవసాయ శాఖలో ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో వైసీపీ తరుపున నాయకుడి అవతారమెత్తి ఇంటింటి ప్రచారంలో కూడా పాల్గొన్నప్పటికీ రాజకీయ పలుకుబడి కారణంగా ఉన్నతాధికారులు సైతం కుర్చీ వదలని మోనార్క్‌పై ఎలాంటి చర్యలు తీసుకోవడానికి ముందుకు రాలేదన్న ఆరోపణలు ఆ శాఖలో గుప్పుమంటున్నాయి.

రెండు దశాబ్దాలకు పైగా ఫెవికాల్ విధులు

నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గంలోని ఓ గ్రామానికి చెందిన ఉద్యోగి మరణానంతరం వారసత్వం కింద ఉద్యోగం పొంది వ్యవసాయ శాఖలో విధులు నిర్వహిస్తూ అప్పటి నుంచి ఇప్పటి వరకు నంద్యాల పరిధిలోనే (మధ్యలో కొంత కాలం మరో డివిజన్‌లో పని చేశారు) విధులు నిర్వహిస్తూ ఆ శాఖనే శాసించే స్థాయికి ఎదిగాడన్న ఆరోపణలు తీవ్రస్థాయిలో ఉన్నాయి. గతంలో కాంగ్రెస్ పార్టీ, ప్రస్తుతం వైసీపీలో కీలక నాయకులైన కొంత మంది రాజకీయ నాయకులందరూ తనకు దగ్గరి బంధువులంటూ వ్యవసాయ శాఖలో చక్రం తిప్పుతూ వస్తున్నాడు. దాదాపు రెండు దశాబ్దాలకుపైగా మోనార్క్‌గా వ్యవహరిస్తున్న ఫెవికాల్ ఉద్యోగి విషయం ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో ఇప్పుడైనా బదిలీ వేటు పడుతుందో లేదో నన్న చర్చ వ్యవసాయ శాఖలో తీవ్రంగా జరుగుతోంది. వ్యవసాయ శాఖలో ఓ విభాగంకు సంబంధించి ఉన్న యూనియన్‌కు నాయకుడిగా చలామణి అవుతూ ఉన్నతాధికారులను సైతం గుప్పిట్లో పెట్టుకొని విధులకు సైతం గైర్హాజరవుతూ శాసించే స్థాయికి ఎదిగిన వైనంపై కూడా హాట్ టాపిక్ చర్చ జోరందుకుంది.



వ్యవసాయ శాఖ నంద్యాల డివిజన్ కార్యాలయం

ఉద్యోగ బాధ్యతలు తూచ్

వ్యవసాయ శాఖలో ఫెవికాల్ బంధంతో నో ట్రాన్స్‌ఫర్ ఉద్యోగిగా, మోనార్క్‌లా వ్యవహరించడమే కాకుండా రైతులకు ప్రతినిత్యం క్షేత్రస్థాయిలో సేవలందించాల్సిన ఉద్యోగ బాధ్యతలను ఏనాడూ సక్రమంగా నిర్వహించలేదన్న ఆరోపణలు తీవ్రస్థాయిలో ఉన్నాయి. ఉద్యోగ బాధ్యతలకు సంబంధించి ఉన్నతాధికారులనే శాసించే స్థాయిలో ఉండటంతో అతని నిర్లక్ష్య విధుల పట్ల ఉన్నతాధికారులు సైతం నోరు మెదపడం లేదు. తాను అనుకుంటే ఎవరినైనా ట్రాన్స్‌ఫర్ చేయిస్తానని, నన్నెవరూ ట్రాన్స్‌ఫర్ చేయలేరని సహచర ఉద్యోగుల వద్ద చెబుతున్న గర్వపు మాటలను చూసి ఆ శాఖ ఉద్యోగులే ముక్కున వేలేసుకుంటున్నారు. ఉద్యోగ విధులను తూచ్‌గా భావించి ఇతర ఆదాయ మార్గాల వైపు దృష్టి సారించి రాజకీయ పలుకుబడితో ఏకంగా రెండు బడా రెస్టారెంట్లను నడుపుతున్న వ్యవసాయ ఉద్యోగి వ్యవహారం ప్రస్తుతం కలకలం రేపుతోంది. బొమ్మలసత్రం ప్రాంతంలో వ్యవసాయ శాఖలోని మరో ముగ్గురు ఉద్యోగులతో కలిసి మోనార్క్‌లా వ్యవహరించే ఫెవికాల్ ఉద్యోగి ప్రధాన భాగస్వామ్యంతో మూడక్షరాల రెస్టారెంట్‌ను నడుపుతున్నారు. రైల్వే స్టేషన్ రోడ్డులో ఉన్న ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో రెస్టారెంట్‌ను కూడా ఇదే ఉద్యోగి నడుపుతుండటం హల్‌చల్ చేస్తోంది. ఇతర ప్రభుత్వ శాఖల్లో సైతం ఉన్నతాధికారులను ప్రసన్నం చేసుకునేందుకు, తన తరుఫున ఏదైనా సమస్య వస్తే వకల్తా పుచ్చుకొని మద్దతుగా మాట్లాడేందుకు తన రెస్టారెంట్‌ల నుంచి పార్శిళ్లను కూడా పంపుతున్నాడన్న ఆరోపణలు తీవ్ర స్థాయిలో ఉన్నాయి.

వైసీపీ తరుపున ప్రచారం

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో నంద్యాల నియోజకవర్గ పరిధిలో తన సొంత గ్రామంలో పాటు చుట్టుపక్కల గ్రామాలు, పట్టణంలోని బొమ్మల సత్రం, క్రాంతినగర్, రైతునగర్, తదితర ప్రాంతాల్లో వైసీపీ విజయం కోసం ఇంటింటి ప్రచారాన్ని చేయడమే కాకుండా తెరవెనుక తతంగమంతా నడిపాడన్న ఆరోపణలు తీవ్ర స్థాయిలో ఉన్నాయి. ఈ విషయాన్ని అప్పట్లోనే కొందరు వ్యవసాయ శాఖలోని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేకుండా పోవడానికి ప్రధానంగా రాజకీయ పలుకుబడే కారణమని ఆ శాఖలోని ఉద్యోగులు గుస గుసలాడుకుంటున్నారు. వైసీపీ తరుపున ఆయా ప్రాంతాల్లో డబ్బు పంపిణీకి కూడా ఈ రెండు రెస్టారెంట్ల నుంచే ఓటుకు నోటు వ్యవహారం నడిచిందన్న విషయం బహిరంగంగానే వినిపిస్తోంది.

ట్రాన్స్‌ఫర్ కాను.. ట్రాన్స్‌ఫర్లు చేయిస్తా

నంద్యాల వ్యవసాయ శాఖలో ఫెవికాల్ వీరుడిగా కుర్చీ వదలకుండా విధులు నిర్వహిస్తున్న ఈ ఉద్యోగి త్వరలో జరగబోయే బదిలీల్లో సైతం తనకు ట్రాన్స్‌ఫర్ రాదని, ఇతరులను మాత్రం ట్రాన్స్‌ఫర్ చేయిస్తానంటూ సహచరుల వద్ద మాట్లాడుతున్న వైనం ఆ శాఖలో దుమారం రేపుతోంది. ఉద్యోగం వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు మధ్యలో రెండు, మూడేళ్ళు మినహా ఇదే డివిజన్‌లో ట్రాన్స్‌ఫర్ లేకుండా విధులు నిర్వహిస్తూ వైసీపీకి వీర విధేయుడిగా చక్రం తిప్పుతున్న మోనార్క్‌పై బదిలీ వేటు పడుతుందా లేదా అన్న విషయం వ్యవసాయ శాఖలో హల్‌చల్ చేస్తోంది. ఈ నేపథ్యంలో త్వరలో జరగబోయే బదిలీలపై వ్యవసాయ శాఖపైనే అందరి దృష్టి కేంద్రీకృతమై ఉంది.

'పెండింగ్ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు'

కొత్తపల్లి, జూలై 13: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిధులు లేక మధ్యలో నిలిచిపోయిన పెండింగ్ రహదారుల నిర్మాణం కోసం రూ.8.36 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు మండల పీఐయూ ఏఈ రమణ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏపీ రూరల్ రోడ్డు ప్రాజెక్టు కింద కొత్తపల్లి మండలంలోని సంగమేశ్వరం నుంచి జానాలగూడెం వరకు 7.4 కిలోమీటర్ల మేర మధ్యలో నిలిచిపోయిన బీటీ రోడ్డు నిర్మాణం కోసం రూ.4.40 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. అలాగే సంగమేశ్వరం వెళ్లే ప్రదాన రహదారి నుంచి చిన్నగుమ్మడాపురం గ్రామంలోకి సీసీ రోడ్డు నిర్మాణం కోసం రూ.66.70 లక్షలు, అలాగే పాములపాడు మండలంలోని కేజీ రోడ్డు నుంచి శాంతి నిలయం వరకు బీటీ రోడ్డు నిర్మాణం కోసం రూ.2.28 కోట్లు, మిట్టికందాల నుంచి బుద్దా నగర్ వరకు రూ.91.45లక్షలతో ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామని ఏఈ వెల్లడించారు.

వెలుగోడులో మోస్తరు వర్షం



వెలుగోడులోని ప్రధాన రహదారిలో నిలిచిన వర్షపు నీరు

వెలుగోడు, జూలై 13: వెలుగోడు పట్టణంలో శనివారం మోస్తరు వర్షం కురిసింది. వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచింది. ఆత్మకూరు, వెలుగోడులోని ప్రధాన రహదారిలో, పెట్రోల్ బంక్ వద్ద వర్షపు నీరు నిలిచి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ వర్షానికి పలు రహదారులు చిత్తడిగా మారాయి. పొలాల్లో వర్షపు నీరు నిలిచింది. వర్షం పడటంతో పలువురు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా వార్షికోత్సవం

నంద్యాల (నూనెపల్లె), జూలై 13: నంద్యాలలోని నారాయణ జూనియర్ కళాశాల 14వ వార్షికోత్సవ వేడుకలు శనివారం స్థానిక ఫంక్షన్ హాలులో ఘనంగా నిర్వహించారు. నారాయణ విద్యాసంస్థల కోర్ డీన్ పి.లింగేశ్వరరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలనం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు .కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. వివిధ పరీక్షల్లో ఉత్తమ ప్రతిబ కనబర్చిన విద్యార్థులను అధ్యాపకులను అభినందించి మొమెంటోలను అందజేశారు. ఈసందర్భంగా విద్యార్థిని విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో డీన్ విశ్వనాథ రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, ఏజీఎం అంజన్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగజ్జననీ అమ్మవారికి పుట్టింటి సారె



అమ్మవారికి పుట్టింటి చీర, సారె తీసుకెళ్తున్న భక్తులు

నంద్యాల (కల్చరల్), జూలై 13: నంద్యాల జగజ్జననీ అమ్మవారికి ఆషాడమాసం సందర్భంగా భక్తులు అమ్మవారికి చీర, సారె సమర్పించు కుంటారు. శనివారం 8వ రోజు ఆషాడమాసం సందర్భంగా జగజ్జననీ అమ్మవారికి మార్కాపురం, ఒంగోలు, కర్నూలు, గుంతకల్లు, హైదరాబాద్, మధ్యప్రదేశ్, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి భక్తులు అమ్మవారికి పుట్టింటి చీర, సారె తీసుకొచ్చి సమర్పించారు. దుర్గా ఫ్రెండ్స్ యూనిట్ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదం అందజేశారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు



నృత్యం చేస్తున్న కళాకారులు

శ్రీశైలం, జూలై 13: శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో శనివారం టీపీ అనురాధ, వికారాబాద్‌కు బృందంతో కూచిపూడి నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో గణపతిప్రార్థన, భో..శంభో, మూషికవాహన, మహిషాసురమర్ధిని, వినాయక కౌత్వం, జతిస్వరం, అదిగదిగో శ్రీశైలం, నటేశకౌత్వం తదితర గీతాలకు కళాకారులు నృత్య ప్రదర్శనతో అలరించారు.

డెంగీ నివారణపై అవగాహన



అమలాపురం గూడెంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యులు

ఆత్మకూరు రూరల్, జూలై 13: బైర్లూటి పీహెచ్‌సీ వైద్యాధికారులు గోపాల్, పవన్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది అమలాపురం గూడెం, కృష్ణాపురం గ్రామాల్లో డెంగీ బారిన పడకుండా రక్షణ చర్యలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి గ్రామంలో ఇంటింటి సర్వే చేపట్టి జ్వర పీడితుల రక్త నమూనాలు సేకరించారు. చిరు వ్యాధులకు చికిత్సలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అలాగే డెంగీ కారక దోమల గురించి గ్రామంలోని నీటితొట్లను, నీటి నిల్వ ఉన్న ప్రాంతాలను పరిశీలించి అబేట్ ద్రావణాన్ని పిచికారీ చేయించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమల బారిన పడకుండా తప్పకుండా దోమతెరలు వాడాలని సూచించారు. జ్వరాలు సోకిన వారు తప్పకుండా దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రులలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రజిత, యశోద, ఆరోగ్య కార్యకర్త మహేశ్వరి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

- నంద్యాల జీజీహెచ్‌ను తనిఖీ చేసిన కలెక్టర్

నంద్యాల (నూనెపల్లె), జూలై 13: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ రాజకుమారి వైద్యులను ఆదేశించారు. నంద్యాలలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాలను శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యశాలలోని పలు వార్డులలో కలియ తిరిగి రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవలపై రోగులతో మాట్లాడి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. అత్యవసర సేవలను అందుబాటులో ఉంచాలని, మందులను కూడా సరఫరా చేయాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఆసుపత్రిలోని ఎంసీహెచ్ బ్లాకులోని రోగులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరిష్కరించాల్సిన పలు సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని వైద్యశాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ మేరకు నివేదికలు సమర్పించాలని సూచించారు. ఆక్సిజన్ సరఫరా, ఓపీలో రోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, కూర్చున్న ప్రదేశాలు కల్పిస్తున్న సౌకర్యాలపై కలెక్టర్ వివరాలు సేకరించారు. ఎమ్ఆర్ఐ, ఎక్స్‌రే సీటీ స్కాన్లు రోజుకు ఎన్ని చేస్తారన్న విషయంపై ఆరా తీసి రికార్డులను పరిశీలించారు. ఆపరేషన్లకు అవసరమైన వైద్య పరికారలను ఆసుపత్రి అభివృద్ధి నిధుల నుంచి కొనుగోలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీకి సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేసి పంపాలన్నారు. వైద్యుల కొరత తక్కువగా ఉందని, కార్డియాలజిస్ట్, సూపర్ స్పెషాలిటీ వైద్యుల కొరత ఉందని సూపరింటెండెంట్ డాక్టర్ వరప్రసాద్ వివరించారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ జఫ్రుల్లా, వైద్య సిబ్బంది ఉన్నారు.



బాలింతతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

'మనుస్మృతిని బోధనాంశంగా చేర్చొద్దు'

ఆత్మకూరు, జూలై 13: ఢిల్లీ యూనివర్సిటీలో ఎల్ఎల్‌బీ అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులో మనుస్మృతిని బోధనాంశంగా చేర్చాలన్న ఆలోచనలను యూనివర్సిటీ అధికారులు విరమించుకోవాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) ఉపాధ్యక్షుడు జునైద్‌బాషా డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ఢిల్లీ యూనివర్సిటీలో వివిధ ఫ్యాకల్టీలకు చెందిన ప్రగతిశీల అధ్యాపకులు, మేధావులు వ్యతిరేకిస్తూ సవరించిన సిలబస్ డాక్యుమెంట్లలో మనుస్మృతిని ప్రవేశపెట్టడానికి యూనివర్సిటీ అధికారులు భావించడం సరికాదని అన్నారు. మనుస్మృతి సమాజంలో మహిళలు, అట్టడుగు వర్గాల దళితులు, అంటరాని కులాల ప్రగతికి, విద్యకు పూర్తిగా ప్రతికూలంగా ఉన్నందున తాము వ్యతిరేకిస్తున్నట్లు వెల్లడించారు.

వాసవీ కన్యకా పరమేశ్వరికి వడిబియ్యం



కోవెలకుంట్లలో వాసవీమాతకు వడిబియ్యం తెచ్చిన ఆర్యవైశ్య మహిళలు

కోవెలకుంట్ల, జూలై 13: కోవెలకుంట్లలోని ఆర్యవైశ్య ఆరాధ్య దైవం వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి వడిబియ్యం కార్యక్రమం పట్టణ ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు సుబ్రహ్మణ్యం, ఆర్యవైశ్య మహిళా మండలి ప్రెసిడెంట్ లింగాల వందన, కర్నాటి జ్యోతి కమిటీ సభ్యుల అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం 9గంటలకు కాశీవిశ్వేశ్వరస్వామి దేవాలయం నుండి ఆర్యవైశ్యమహిళలందరూ ఊరేగింపుగా సాంప్రదాయ దుస్తులతో పట్టుచీరలు ధరించి అమ్మవారిశాలకు చేరుకున్నారు. అమ్మవారిశాలలో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి వడిబియ్యం సమర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళలు పాల్గొన్నారు.

మద్దిలేటి స్వామి క్షేత్ర ఆదాయం రూ.3.17లక్షలు

బేతంచెర్ల, జూలై 13: మండలంలోని ఆర్ఎస్ రంగాపురంలో వెలసిన మద్దిలేటి నరసింహస్వామి క్షేత్ర ఆదాయం రూ.3.17 లక్షలు సమకూరినట్లు ఉప కమిషనర్, ఆలయ నిర్వహణాధికారి రామాంజనేయులు, చైర్మన్ సీతా రామచంద్రుడు శనివారం తెలిపారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు ఉమ్మడి జిల్లాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులు వేకువజాము నుంచే స్వామి అమ్మవార్లకు అభిషేకాలు, గండదీపాలు, ప్రత్యేక పూజలు చేసి పుట్టు వెంట్రుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. స్వామి సేవా టికెట్లు, లడ్డూ ప్రసాదం, కేశఖండన, రూము బాడుగలు, లీజుల వసూళ్ల ద్వారా రూ.3,17,065ల ఆదాయం దేవస్థానానికి లభించినట్లు వారు తెలిపారు.

'నిందితులను శిక్షించాలి'



ఆత్మకూరులో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు, జూలై 13: పగిడ్యాల మండలంలోని ముచ్చుమర్రి గ్రామంలో 9ఏళ్ల బాలికను హతమార్చిన నిందితులను కఠినంగా శిక్షించాలని సీపీఎం నాయకులు రణధీర్, నరసింహ నాయక్, భాస్కర్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ఆ పార్టీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ 9ఏళ్ల బాలికను అత్యాచారం చేసి ఆపై హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం రూ.50 లక్షలు ఇవ్వాలని అన్నారు. అలాగే భవిష్యత్తులో ఇలాంటి ఘటన పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు స్వాములు, రామ్‌నాయక్, వలి, మోహన్, కాశీ, రవి, రాజు, విజయ్ తదితరులు ఉన్నారు.

- ఆదోని మండలంలోని నాగనాతనహళ్లి గ్రామంలో దళిత మహిళ గుండమ్మను అతికిరాతంగా ట్రాక్టర్ తొక్కించి హత్య చేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని ప్రజా సంఘాల నాయకులు భాస్కర్, స్వాములు, నరసింహ నాయక్, వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కేసు కోర్టులో కొనసాగుతున్నప్పటికీ ఇరువురు వ్యక్తులు గుండమ్మ సాగుచేసిన పొలాన్ని ట్రాక్టర్‌తో దున్నేందుకు వెళ్లారని, అడ్డుగా వచ్చిన గుండమ్మను సైతం ట్రాక్టర్ ఎక్కించి ఆమె మరణానికి కారకులయ్యారని అన్నారు. నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'వడ్డె ఓబన్న జయంతిని అధికారికంగా నిర్వహించాలి'



టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులుకు వినతి పత్రం అందిస్తున్న ఒడ్డె ఓబన్న సేవా సమితి నాయకులు

గడివేముల, జూలై 13: బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు వడ్డె ఓబన్న జయంతిని ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించాలని అఖిల భారత వడ్డె ఓబన్న సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బాల నరసింహులు, నంద్యాల జిల్లా అధ్యక్షుడు బీవీఎన్ రాజు కోరారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులును మంగళగిరిలో పార్టీ కార్యాలయంలో శనివారం కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ వడ్డెరల అభివృద్ధికి టీడీపీ ప్రభుత్వం పథకాలను తీసుకొని రావాలని విజ్ఞప్తి చేశారు. వడ్డెరలకు క్వారీలలో రిజర్వేషన్ కల్పించాలని అన్నారు. 50 సంవత్సరాలు నిండిన వడ్డెరలకు పింఛన్ ఇవ్వాలన్నారు. స్వయం ఉపాధి కోసం రుణాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. పనిముట్లకు రాయితీలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో అఖిల భారత వడ్డె ఓబన్న సేవా సమితి నాయకులు సంపంగి, శివకృష్ణ, చిన్న, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో సిబ్బంది కొరత

- 33 మందికి గానూ విధుల్లో 12 మంది ఉద్యోగులు
- ప్రజలకు అందని మున్సిపల్ సేవలు

ఆత్మకూరు, జూలై 13: ఆత్మకూరు మున్సిపాలిటీ పరిపాలనపై ఆ శాఖ ఉన్నతాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మేజర్ గ్రామ పంచాయతీగా ఉన్న ఆత్మకూరు పట్టణానికి 2011 జూలై నెలలో నగర పంచాయతీ హోదాను కల్పించారు. ఆ తర్వాత 2019 జూలైలో గ్రేడ్-3గా, 2022 ఆగస్టులో గ్రేడ్-2 మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేశారు. దీంతో ప్రజలపై పన్నుభారాన్ని పెంచారే తప్ప మున్సిపాలిటీలో మెరుగైన పాలన దిశగా అధికారులు చర్యలు తీసుకోలేదన్న విమర్శలు ఉన్నాయి. ప్రత్యేకించి కార్యాలయంలో పరిపాలన నిమిత్తం ఆయా విభాగాల్లో ఉన్న పోస్టులను భర్తీ చేయడంతో మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయంలోని ఆరు విభాగాల పరిధిలో కమిషనర్‌తో సహా మొత్తం 33 మంది ఉద్యోగులు పనిచేయాల్సి ఉండగా.. ప్రస్తుతం కేవలం 12 మంది మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో పరిపాలన అస్తవ్యస్తంగా తయారవ్వడంతో పాటు ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగులకు కూడా పనిభారం తప్పడం లేదు. అంతేకాకుండా కార్యాలయ నిర్వహణకు సంబంధించి ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోతున్నాయని తెలుస్తోంది. గత 13 ఏళ్లగా ఇదే పరిస్థితి నెలకొన్నప్పటికీ సంబంధిత ఉన్నతాధికారులు సమస్యను పరిష్కరించడంలో విఫలమయ్యారన్న ఆరోపణలు లేకపోలేదు. ఇదిలావుంటే ఇటీవల జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో సభ్యులు ఈ సమస్యను లేవనెత్తారు. మున్సిపాలిటీలో పూర్తిస్థాయిలో ఉద్యోగులు లేకపోవడం వల్ల సేవలకు అంతరాయం ఏర్పడుతోందని స్పందించారు. తక్షణమే పూర్తిస్థాయిలో పోస్టుల భర్తీ చేపట్టాలని వారు కోరారు.



ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయం

33 మందికి గానూ.. 12 మంది ఉద్యోగులతోనే విధులు

ఆత్మకూరు మున్సిపాలిటీ కార్యాలయంలో మొత్తం 33 మంది ఉద్యోగులు పనిచేయాల్సి వుండగా 12 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో ప్రధానంగా పరిపాలన విభాగానికి సంబంధించి ఒక మేనేజర్ పోస్టు, సీనియర్ స్టెనోగ్రాఫర్, సిస్టమ్ మేనేజర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే రెవెన్యూ విభాగంలో ఇద్దరు బిల్ కలెక్టర్లను నియమించాల్సి ఉండగా వీరిలో ఒక పోస్టు ఖాళీగా ఉంది. అదేవిధంగా అకౌంట్స్ విభాగంలో ఒక సీనియర్ అకౌంటెంట్, ఒక జూనియర్ అకౌంటెట్ పోస్టు, పబ్లిక్ హెల్త్ విభాగంలో ఒక శానిటరీ ఇన్‌స్పెక్టర్, రెండు హెల్త్ అసిస్టెంట్ పోస్టులు, ఒక మేస్త్రీ పోస్టు, ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ఇంజనీర్, డ్రాఫ్ట్‌మన్, వర్క్‌ఇన్‌స్పెక్టర్, సీపీడీ ఆపరేటర్ పోస్టులు భర్తీకి నోచుకోలేదు. అదేవిధంగా టౌన్‌ప్లానింగ్ విభాగంలో టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్, సూపర్‌వైజర్, టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ అబ్జర్వర్, ట్రేసర్, సీఏడీ/జీఐఎస్ ఆపరేటర్, టౌన్ సర్వేయర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇప్పటికైనా.. సంబంధిత మున్సిపల్‌శాఖ ఉన్నతాధికారులు చొరవ తీసుకుని ఆత్మకూరు మున్సిపాలిటీ కార్యాలయంలో ఆయా విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం



ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో ఖాళీగా ఉన్న ఆయా పోస్టులను భర్తీ చేయాలని మున్సిపల్‌శాఖ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. వాస్తవానికి సిబ్బంది కొరత వల్ల ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగులపై పనిభారం పడుతోంది. అయితే మున్సిపాలిటీ తరుపున ప్రజలకు అందాల్సిన సేవల్లో ఎలాంటి లోపాలు రానివ్వం. త్వరలోనే ఆయా పోస్టులను భర్తీ చేయించేలా ఉన్నతాధికారులకు సమస్యను వివరిస్తాం.

- హరిప్రసాద్, మున్సిపల్ కమిషనర్, ఆత్మకూరు

ఘనంగా
వాసవీ కన్యకాపరమేశ్వరికి వడిబియ్యం


కోవెలకుంట్లలో వాసవీమాతకు వడిబియ్యం తెచ్చిన ఆర్యవైశ్య మహిళలు

కోవెలకుంట్ల, జూలై 13: కోవెలకుంట్లలోని ఆర్యవైశ్య ఆరాధ్య దైవం వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి వడిబియ్యం కార్యక్రమం పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు సుబ్రహ్మణ్యం, ఆర్యవైశ్య మహిళా మండలి ప్రెసిడెంట్ లింగాల వందన, కర్ణాటి జ్యోతి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం 9గంటలకు కాశీవిశ్వేశ్వరస్వామి దేవాలయం నుండి ఆర్యవైశ్యమహిళలందరూ ఊరేగింపుగా సాంప్రదాయ దుస్తులతో పట్టుచీరలు ధరించి అమ్మవారిశాలకు చేరుకున్నారు. అమ్మవారిశాలలో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి వడిబియ్యం సమర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళలు పాల్గొన్నారు.

నేడు కోవెలకుంట్లలో యోగా క్లాసులు

కోవెలకుంట్ల, జూలై 13 : కోవెలకుంట్ల పట్టణంలో ఆదివారం ఉదయం 5.30కు యోగా క్లాసులు నిర్వహిస్తున్నట్లు గవర్నమెంటు జూనియర్ కళాశాల అధ్యాపకులు రామలింగారెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మునిసార్ పర్యవేక్షణలో జనార్దన శెట్టి, వనజమ్మ యోగా గురువులు ఆధ్వర్యంలో నిర్వహిస్తామని తెలిపారు. ఈ యోగాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ..

కొలిమిగుండ్ల, జూలై 13: విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో మరమ్మతుల కారణంగా నేడు ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని కొలిమిగుండ్ల విద్యుత్ శాఖ ఏఈ ప్రసన్న ఆంజనేయులు తెలిపారు. తిమ్మనాయినిపేట, పేరుసోముల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 12.30వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

పరిశుభ్రత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఓఎన్‌జీసీ సిబ్బంది

కొలిమిగుండ్ల, జూలై 13: పరిశుభ్రత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఓఎన్‌జీసీ కొలిమిగుండ్ల బేస్ క్యాంప్ ముఖ్య అధికారి జగదీష్ పేర్కొన్నారు. ఓఎన్‌జీసీ వారి ఆధ్వర్యంలో జూలై 1 నుంచి 15వరకు స్వచ్ఛత, పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. శనివారం బెలుం గుహల ఆవరణలో ఓఎన్‌జీసీ సిబ్బంది, బెలుం గుహల సిబ్బందితో కలిసి శ్రమదానం నిర్వహించారు.

కాంట్రాక్టు అధ్యాపకులకు జీతాలు అందించండి

బనగానపల్లె, జూలై 13: కాంట్రాక్టు అధ్యాపకులకు జీతాలు చెల్లించాలని ఏపీ కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కిశోర్ కుమార్ శనివారం కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 3,600 మంది కాంట్రాక్టు అధ్యాపకులు పనిచేస్తున్నారని, నంద్యాల జిల్లాలో135 మంది పనిచేస్తున్నారన్నారు. 24 ఏళ్లుగా కాంట్రాక్టు అధ్యాపకులుగా పనిచేస్తున్నప్పటికీ ప్రతి ఏడాది రెన్యువల్ ఉత్తర్వుల కోసం ఎదురు చూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచడమే కాకుండా పెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక విద్యాబోధన చేస్తున్నామని తెలిపారు.

ముస్తాబైన సాయిబాబా ఆలయం



కొలిమిగుండ్ల, జూలై 13: మండలంలోని ఎర్రగుడి గ్రామంలో షిరిడీ సాయిబాబా ఆలయంలో ఈనెల 20, 21వ తేదీల్లో గురుపౌర్ణిమ వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం వెల్లడించారు. 20న రాత్రికి భరత నాట్య ప్రదర్శన ఉంటుందన్నారు. 21న ప్రముఖ ఆధ్యాత్మిక వేద పండితులచే మధ్యాహ్న హారతి, ఆధ్యాత్మిక ప్రసంగాలు, భజనలు, అన్నదానం కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

నిర్మాణం పూర్తి కాకముందే అనుమతులా?


మాట్లాడుతున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

డోన్(రూరల్), జూలై 13: పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఓ ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలకు భవనాలు నిర్మాణాలు పూర్తి కాకముందే అనుమతులు ఎలా ఇస్తారని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజు, జిల్లా కార్యదర్శి మహేశ్వరయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు తెలుగు విజయకుమార్ ప్రశ్నించారు. శనివారం డోన్‌లో వారు మాట్లాడుతూ పట్టణంలో ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలపై సంబంధిత అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. భవన నిర్మాణాలు కాకముందే అడ్మిషన్లు నిర్వహిస్తున్నారన్నారు. విద్యాధికారులు ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోకపోతే, కలెక్టరేట్ ఎదుట ఆందోళనలకు పూనుకుంటామని హెచ్చరించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి


మాట్లాడుతున్న వాల్మీకి నాయకులు

డోన్(రూరల్), జూలై 13: ముచ్చుమర్రి గ్రామానికి చెందిన చిన్నారి వాసంతిని హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని వాల్మీకి సంఘం నాయకుడు వెంకటనాయునిపల్లె గ్రామ సర్పంచ్ నీలం చంద్రశేఖర్ నాయుడు డిమాండ్ చేశారు. శనివారం డోన్‌లో ఆయన మాట్లాడుతూ గత ఐదు రోజుల నుంచి చిన్నారి ఆచూకీ లభించలేదన్నారు. పోలీసులు గాలిస్తున్నా ఫలితం శూన్యమని అన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు గట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

అన్ని వర్గాల ప్రజలకు టీడీపీతోనే న్యాయం

● డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి


నగర పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి

బేతంచెర్ల, జూలై 13: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగేది టీడీపీతోనే అని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని శేషారెడ్డి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని డోన్ ఎమ్మెల్యే కోట్ల అకస్మికంగా సందర్శించి ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ప్రభుత్వ వైద్యులు మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రిలోని సమస్యలను తమ దృష్టికి తీసుకుని వస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అదే విధంగా నగర పంచాయతీ కార్యాలయాన్ని డోన్ ఎమ్మెల్యే కోట్ల సందర్శించి సమస్యలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ పట్టణ కార్యదర్శి షేక్షావలి చౌదరి, సమన్వయ చైర్మన్ సుధాకర్, నాయకులు ఉన్నారు.

● ఆర్యవైశ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ అన్ని విధాలా అండగా ఉంటానని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. ముందుగా ఆయన ఆంజనేయస్వామికి అమ్మవారిశాలలోని వాసవి కన్యకాపరమేశ్వరిదేవికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారిశాలలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సభకు ఆయన విశిష్ట అతిథిగా హాజరయ్యారు. కోట్ల స్పందిస్తూ నాపరాళ్ల ఫ్యాక్టరీలకు రాయితీలను కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. అనంతరం ఉపాధ్యాయుడు సురేష్ కుమార్ రాసిన అల్లూరి సీతారామరాజు జీవిత చరిత్ర పుస్తకాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, ఉపాధ్యాయులు, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

● మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామ శివారులోని మద్దిలేటి నరసింహస్వామి, మహాలక్ష్మి అమ్మవార్లను డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో రామాంజనేయులు, వేద పండితులు, అర్చకులు ఎమ్మెల్యేకు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో స్వాగతం పలికి సాదరంగా ఆహ్వానించారు.

గాయపడిన కార్యకర్తలను పరామర్శించిన ఎమ్మెల్యే కోట్ల


డోన్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న టీడీపీ కార్యకర్తలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కోట్ల

డోన్, జూలై 13: ప్యాపిలి మండలంలోని పోదొడ్డి గ్రామంలో వైసీపీ వర్గీయుల దాడిలో గాయపడి డోన్ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న టీడీపీ కార్యకర్తలను శనివారం ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి పరామర్శించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై.నాగేశ్వరరావు యాదవ్, సీనియర్ న్యాయవాది బాస్కర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే కోట్ల బాధితులను పరామర్శించారు. దాడికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోట్ల మాట్లాడుతూ టీడీపీ కార్యకర్తల జోలికి వస్తే సహించే ప్రసక్తే లేదన్నారు. ప్రజలు బుద్ధి చెప్పినా ఇంకా వైసీపీ నాయకుల్లో మార్పు రాలేదన్నారు. టీడీపీ కార్యకర్తలపై దాడులకు పాల్పడుతున్నారనీ, పద్ధతి మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయనీ ఎమ్మెల్యే కోట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడికి పాల్పడిన వైసీపీ నాయకులపై పోలీసులు గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. పార్టీ కార్యకర్తలకు అన్ని రకాలుగా తాను అండగా ఉంటానన్నారు.

ఆలయ భూములకు కౌలు వేలం


యల్లావత్తులలో వేలం పాట నిర్వహిస్తున్న దేవదాయశాఖ అధికారులు

రుద్రవరం, జూలై 13: మండలంలోని యల్లావత్తుల గ్రామంలో శిరివెళ్ల ఎస్ఐ సురేష్ నిర్వహించిన పోలీసు బందోబస్తు మధ్య లక్ష్మీనరసింహ స్వామి, నాగేశ్వర స్వామి దేవాలయ భూములకు కౌలు వేలం శనివారం దేవదాయశాఖ అధికారులు నిర్వహించారు. నరసింహస్వామి దేవాలయానికి సంబంధించి సర్వే నెంబరు 296లో 9.02, 455లో 27.38, 317లో 7.77, నాగేశ్వర స్వామి దేవాలయం భూములకు సంబంధించి సర్వే నెంబరు 15లో 3.44, 19లో 2.28 ఎకరాలకు కౌలు వేలం నిర్వహించారు. ఈ కౌలు వేలంలో గత ఏడాది రూ.4.56 లక్షలు ఆదాయం రాగా ప్రస్తుతం రూ.5.70 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఈవో నరసయ్య తెలిపారు. గత ఏడాది కంటే ఈ ఏడాది దేవాలయాలకు రూ.1.14 లక్షలు ఆదాయం అదనంగా చేకూరిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రమోహన్, ఈవో బండిచంద్రుడు, సిబ్బంది రమణ పాల్గొన్నారు.

బెలుంలో పడకేసిన పారిశుధ్యం


రహదారిపై ప్రవహిస్తున్న మురుగు

కొలిమిగుండ్ల, జూలై 13: మండలంలోని బెలుం గ్రామం అపరిశుభ్రతకు నిలయంగా మారింది. గ్రామంలోని ఎస్సీ కాలనీ, బీసీ కాలనీ, కుమ్మరి కట్ట వీధి, శివాలయం తదితర అనేక వీధులు పారిశుధ్యం పడకేసింది. పంచాయతీ సిబ్బంది డ్రైనేజీలను శుభ్రం చేయాలని అనేక సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో డ్రైనేజీల్లో మురుగునీరు నిండి, రోడ్లపై ప్రవహిస్తోంది. అధికారులు స్పందించి గ్రామంలో డ్రైనేజీలను శుభ్రం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

స్నేహితుడికి ఆర్థిక సాయం


స్నేహితుడికి ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు

బేతంచెర్ల, జూలై 13: పట్టణంలోని దుర్గాపేటకు చెందిన గూడెం మద్దిలేటి ట్రాక్టరు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న తోటి స్నేహితులు రూ.26వేలు ఆర్థిక సాయాన్ని శనివారం అందజేశారు. శేషారెడ్డి ఉన్నత పాఠశాలలో 2004 సంవత్సరం 10వ తరగతి బ్యాచ్‌కు చెందిన తోటి స్నేహితుడు గూటం మద్దిలేటి గత పది రోజుల క్రితం ట్రాక్టర్ డ్రైవింగ్ చేస్తూ ప్రమాదానికి గురయ్యాడు. స్నేహితులు స్పందించి నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మద్దిలేటిని పరామర్శించి ఆర్థిక సాయాన్ని అందజేశారు.

సీఎం చంద్రబాబుపై దేవుడి కరుణ

● ఆటో యాత్రికుడు అబ్దుల్ గఫార్



ఆలమూరులో ఆటోయాత్ర చేస్తున్న అబ్దుల్ గఫార్

రుద్రవరం, జూలై 13: ఏపీ సీఎం చంద్రబాబునాయుడుపై దేవుడి కరుణా, కృపా ఉన్నట్లే. అందుకే నాలుగోసారి సీఎం అయ్యారని ఆటో యాత్రికుడు అబ్దుల్ గఫార్ అన్నారు. శనివారం మండలంలోని ఆలమూరు, నరసాపురం గ్రామాల్లో ఆటో యాత్ర నిర్వహించారు. ఆటో యాత్రలో దేవుని కృప, ప్రజల ఆశీస్సులు ఉన్నందునే చంద్రబాబు నాలుగోసారి సీఎం అయి ఏపీకి సేవలందిస్తున్నారని అన్నారు.

హెల్మెట్ ధరించాలి


వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ

సంజామల, జూలై 13: ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని ఎస్ఐ రమేష్‌రెడ్డి ద్విచక్ర వాహనదారులకు సూచించారు. శనివారం సాయంత్రం ముదిగేడు క్రాస్‌రోడ్డు వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. రూట్ పర్మిట్, ఇన్సూరెన్స్, యూనిఫాం లేని వాహనదారులకు రూ.2,700 జరిమానా విధించారు. వాహనదారులు అన్ని పత్రాలను సక్రమంగా ఉండాలని అన్నారు. లేనిపక్షంలో వాహనాలను స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు.

వాహనాల తనిఖీ

కొలిమిగుండ్ల, జూలై 13: మండలంలోని ప్రధాన రహదారుల్లో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్‌రెడ్డి శనివారం విస్తృతంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. నిబంధనలను పాటించని పలు వాహనాలను గుర్తించి, అపరాధ రుసుం విధించారు. ఒక సిమెంట్ ట్యాంకరు, నాపరాళ్ల లారీతో పాటు నాలుగు వాహనాల పత్రాలు సక్రమంగా లేకపోవడంతో స్వాధీనం చేసుకొని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

వంగతోట దున్నివేత


ట్రాక్టరుతో వంగ తోటను దున్నివేస్తున్న రైతు రామిరెడ్డి

రుద్రవరం, జూలై 13: మండలంలోని డి.కొట్టాల గ్రామానికి చెందిన రైతు రామిరెడ్డి వ్యవసాయ బోరు బావి కింద మూడెకరాలు వంగ తోట సాగు చేశారు. శనివారం వంగ తోటను ట్రాక్టరుతో దున్నివేశారు. వంగ తోటకు పురుగు దాడి విపరీతంగా ఉందని, పురుగు దాడి తట్టుకోలేక వంగ తోట దున్నివేశానని తెలిపారు. పెట్టుబడి కింద సుమారు రూ.లక్ష ఖర్చు చేసినట్లు తెలిపారు.

మద్దిలేటి స్వామి క్షేత్ర ఆదాయం రూ.3.17లక్షలు

బేతంచెర్ల, జూలై 13: మండలంలోని ఆర్ఎస్ రంగాపురంలో వెలసిన మద్దిలేటి నరసింహస్వామి క్షేత్ర ఆదాయం రూ.3.17 లక్షలు సమకూరినట్లు ఉప కమిషనర్, ఆలయ నిర్వహణాధికారి రామాంజనేయులు, చైర్మన్ సీతారామచంద్రుడు శనివారం తెలిపారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు ఉమ్మడి జిల్లాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులు వేకువజాము నుంచే స్వామి అమ్మవార్లకు అభిషేకాలు, గండదీపాలు, ప్రత్యేక పూజలు చేసి పుట్టు వెంట్రుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. స్వామి సేవా టికెట్లు, లడ్డూ ప్రసాదం, కేశఖండన, రూము బాడుగలు, లీజుల వసూళ్ల ద్వారా రూ.3,17,065ల ఆదాయం దేవస్థానానికి లభించినట్లు వారు తెలిపారు.

వేంకటేశ్వరస్వామికి లక్ష కుంకుమార్చన


వాసాపురంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

రుద్రవరం, జూలై 13: మండలంలోని వాసాపురం వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు వారణాసి గోపిశర్మ, శివశర్మ వేంకటేశ్వర స్వామి, లక్ష్మీగోదాదేవి, మానస లింగేశ్వరస్వామి, త్రిపురసుందరీదేవి అమ్మవార్లకు అభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు. మహిళా భక్తులు దీపాలు వెలిగించారు. వేంకటేశ్వరస్వామి ఆలయంలో లక్ష కుంకుమార్చన నిర్వహించారు. వేలాది మంది భక్తులు సుదూర ప్రాంతాల నుంచి కాలినడకన నడిచి వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

● రుద్రవరంలో వేంకటేశ్వరస్వామి, సంతాన వేణుగోపాలస్వామి, రుక్మిణీ సత్యభామ అమ్మవార్లకు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆయా ఆలయాల్లో అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో భక్తులు గీతా పారాయణం చేపట్టారు.

● మండలంలోని నరసాపురం, రుద్రవరం గ్రామాల్లోని నరసింహ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆయా ఆలయాల్లో అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాదం అందించారు.

బేతంచెర్ల మండల మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడిగా సయ్యద్ బాషా


మండల అధ్యక్షుడిగా సయ్యద్ బాషా

బేతంచెర్ల, జూలై 13: మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు, ఫౌండర్ మహమ్మద్ ఫరూక్ షుబ్లీ సమక్షంలో బేతంచెర్ల మండల మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా శనివారం ఎన్నుకున్నారు. నూతన మండల అధ్యక్షుడిగా బేతంచెర్ల బైటిపేట టీడీపీ నాయకులు సయ్యద్ ఇద్రుస్ బాషా, ఉపాధ్యక్షులుగా షేక్ అబ్దుల్ సలామ్, ప్రధాన కార్యదర్శిగా షేక్ మహబూబ్ వలి (ఎంఎస్), జాయింట్ కార్యదర్శిగా సయ్యద్ అంజాద్ బాషా, మరో 9 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

వ్యాధుల నివారణపై అవగాహన ర్యాలీ


ముత్యాలపాడులో ర్యాలీ చేస్తున్న వైద్యులు, ఏఎన్ఎంలు

చాగలమర్రి, జూలై 13: ముత్యాలపాడు గ్రామంలో వైద్యులు తస్లిమా సుల్తాన ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు కలిసి వ్యాధుల నివారణపై అవగాహన ర్యాలీ శనివారం నిర్వహించారు. డెంగీ, మలేరియా, అతిసార తదితర వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్యులు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమలు కుట్టకుండా జాగ్రత్త లు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారులు వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు, సీహెచ్‌వోలు తేజ, మానస, ఏఎన్ఎం సుభాషిణి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

● నేలంపాడు గ్రామంలో డెంగీ వ్యాధి లక్షణాలు, నివారణపై వైద్యులు ఇమ్రాన్ ప్రజలకు అవగాహన కల్పించారు. శనివారం గ్రామ ఆరోగ్య కేంద్రంలో సీజనల్ వ్యాధులకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం పురవీధుల గుండా ర్యాలీ చేశారు. సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ శ్రీకాంత్, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

లాల్‌స్వామికి ప్రత్యేక ఫాతేహాలు


చాగలమర్రిలో లాల్‌స్వామికి ఫాతేహాలు చేస్తున్న టీడీపీ నాయకులు

చాగలమర్రి, జూలై 13: చాగలమర్రిలోని చిన్నమకానం వీధిలో మొహర్రం వేడుకల సందర్భంగా కొలువుదీరిన లాల్‌స్వామికి శనివారం టీడీపీ నాయకులు ప్రత్యేక ఫాతేహాలు చేశారు. వరుణ దేవుడు కరుణించాలంటూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మొహర్రం పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. బీసీ సంఘం మాజీ అధ్యక్షుడు రామతీర్థం, టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి గుత్తి నరసింహులు, దూదేకుల సంఘం అధ్యక్షుడు మహబూబ్‌బాషా, టీడీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, శంకరసుబ్బారావు, మదార్‌సా పాల్గొన్నారు.

వైభవంగా హుర్‌షాహిద్ పీర్ల ఊరేగింపు

చాగలమర్రి గ్రామంలోని కోటగడ్డ వీధిలో కొలువుదీరిన హుర్‌షాహిద్ పీర్ల ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పీర్లను పురవీధుల గుండా ఊరేగింపు చేశారు. పీర్ల చావిడి ముందు అగ్నిగుండం ఏర్పాటు చేసి గుండం చుట్టూ పీర్లను తిప్పారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ రమణయ్య పర్యవేక్షణలో పోలీసు బందోబస్తు చేపట్టారు.

'మొహర్రం ప్రశాంతంగా జరుపుకోవాలి'

చాగలమర్రి, జూలై 13: గ్రామాల్లో ప్రజలు మొహర్రం ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ రమణయ్య సూచించారు. శనివారం పోలీసు స్టేషన్ ఆవరణలో శాంతి కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ హిందూ, ముస్లింల ఐక్యతకు మొహర్రం ప్రతీక అన్నారు. మొహర్రం వేడుకల్లో ఘర్షణలకు పాల్పడితే పోలీసు చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు, ప్రభుత్వ ఖాజీ యూనస్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గ్రామాల్లో కొలువుదీరిన పీర్లు

రుద్రవరం, జూలై 13: మండలంలోని కొండమాయపల్లె, రుద్రవరం, యల్లావత్తుల నాగులవరం, శ్రీరంగాపురం ఇంకా పలు గ్రామాల్లో మొహర్రం వేడుకలు ప్రారంభమయ్యాయి. యల్లావత్తుల ఇంకా అన్ని గ్రామాల్లో పీర్లను కొలువుదీర్చారు. ఆదివారం మధ్య సరిగెత్తు నిర్వహించనున్నారు. బుధవారం మొహర్రం వేడుకలు ముగుస్తాయి. బుధవారం ఏకాదశి ఉండడంతో యల్లావత్తుల, శ్రీరంగాపురం గ్రామాల్లో గురువారం పీర్లను ఏటికి సాగనంపేందుకు గ్రామ పెద్దలతో చర్చించి నిర్ణయం తీసుకున్నారు.

'సీపీఎస్‌ను రద్దు చేయాలి'


మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర అదనపు కార్యదర్శి శివశంకర్

చాగలమర్రి, జూలై 13: సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ అమలు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర అదనపు కార్యదర్శి శివశంకర్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం బేతంచర్లలో జరిగే జిల్లా సమావేశానికి ఎస్టీయూ మండలశాఖ అధ్యక్షుడు మస్తాన్‌బాషా, ప్రధాన కార్యదర్శి సుబ్బారావు ఆధ్వర్యంలో తరలివెళ్లారు. వారు మాట్లాడుతూ ఈనెల 12న విడుదల చేసిన జీపీఎస్ గెజిట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బకాయిలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మహబూబ్‌బాషా, జిల్లా కౌన్సిలర్ సురేషప్ప, సాంకేతిక కమిటీ కన్వీనర్ నాగేంద్రకుమార్, ఆర్థిక కార్యదర్శి మాబుహుసేన్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు

ఉయ్యాలవాడ, జూలై 13: మండలంలోని ఆర్.జంబులదిన్నె గ్రామ మెట్ట వద్ద వెలసిన అభయాంజనేయ స్వామికి శనివారం ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. అర్చకుడు కీర్తి లక్ష్మణస్వామి స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం స్వామి వారికి ఆకు పూజ, కుంకుమార్చన, గణపతిపూజ చేసి నవగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు.

కళాకారిణికి ఎమ్మెల్యే అభినందనలు


ఆళ్లగడ్డ పట్టణంలోని మహాలక్ష్మి ఫంక్షన్‌హాల్‌లో భరత నాట్యం చేస్తున్న ధాత్రిరెడ్డి

నంద్యాల, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ మండలంలోని ఓబుళంపల్లె గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, ఎన్ఆర్ఐ గౌరు రామకృష్ణారెడ్డి కూతురు ధాత్రిరెడ్డి భరత నాట్యంలో చేసిన అరగేంట్రం శనివారం అలరించింది. ఆళ్లగడ్డలోని మహాలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో భరత నాట్యం చేశారు. ధాత్రిరెడ్డి భరత నాట్యం అలరగేంట్రానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అఖిలప్రియ, కాటన్‌బోర్డు మాజీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి(వాసు) హాజరయ్యారు. ధాత్రిరెడ్డి భరతనాట్యాన్ని తిలకించిన ఎమ్మెల్యే అఖిలప్రియ, వాసు అభినందనలు తెలిపారు.